



రెండు గేట్లు ఎత్తి సర్పానదికి విడుదల చేస్తున్న అదనపు నీరు



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్లాట్‌ఫారాల వద్దకు చేరిన వర్షపు నీరు



వడ్డాది వంతెనపై నిలిచిన వర్షపు నీరు

ముంచెత్తిన వాన

(అనకాపల్లి- న్యూస్ నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. ఈ వర్షాలు మరో రెండు రోజులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. శుక్రవారం జిల్లాలో పలు మండలాల్లో అధిక వర్షాలు, కొన్నిచోట్ల ఒక మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పట్టణాలు, మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో జనం ఇబ్బందులు పడ్డారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

- మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం
- జిల్లా యంత్రాంగం అప్రమత్తం

అనకాపల్లిలో శుక్రవారం రోజంతా కురిసిన వర్షం కారణంగా పలు వీధుల్లో వర్షపు నీరు చేరింది. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోకి వర్షపునీరు చేరడమే కాకుండా ప్రయాణికులు వేచివుండే ప్లాట్‌ఫారాల మీదకు నీరు రావడంతో ప్రయాణికులు ఆరుబయట వేచి వుండాల్సి వచ్చింది. బస్సులు నిలిపేచోట కూడా వర్షపు నీరు చేరి జలమయం కావడంతో బస్సులను అధికారులు వేరొకచోట నిలపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అనకాపల్లి నుంచి తుమ్మపాల మీదుగా చోడవరం వెళ్లే ప్రధాన రోడ్డుపై గుంతల్లో నీరు చేరి వాహన రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు చేరడంతో బైపాస్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించారు. గొలుగొండ మండలం కొండపాలెంలో వర్షానికి ఒక పెంకిటిల్లు దెబ్బతింది. మిగిలిన మండలాల్లో ఎటువంటి నష్టం వాటిల్లకపోయినా ఏకధాటిగా కురిస్తున్న వర్షాలతో జనజీవనానికి అంతరాయం కలిగింది.

యంత్రాంగం అప్రమత్తం

మరో రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ విజయకృష్ణన్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శుక్రవారం సెలవు ప్రకటించారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఫోన్‌లో వివిధ మండలాల తహసీల్దార్లు, వ్యవసాయాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నారు. అధికారులు ఎవరూ మండల కేంద్రాలను విడిచి వెళ్లవద్దని ఆదేశించారు.

రెండు రోజుల్లో వర్షపాతం నమోదు ఇలా....

జిల్లాలో గురు, శుక్రవారాల్లో అధిక వర్షపాతం ... మిగతా 8వ పేజీలో

నిండు కుండలా జలాశయాలు

అనకాపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం కురిసిన వర్షాలకు జలాశయాల్లో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. తాండవ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 380 అడుగులు కాగా, శుక్రవారం నాటికి 364.60 అడుగులకు చేరింది. రైవాడ నీటి సామర్థ్యం 114 మీటర్లకు గాను 106.35 మీటర్లకు, కోనాం నీటి సామర్థ్యం 101.25 మీటర్లకు గాను 98.35 మీటర్లకు చేరింది. వరహా 460 అడుగులకు గాను 458.80, పెద్దేరు 137 మీటర్ల సామర్థ్యం కాగా 136.20 మీటర్లకు నీరు చేరింది. జలాశయాలకు భారీగా వర్షపు నీరు చేరుతుండంతో ఆయకట్టు రైతులు సాగునీటి పనులకు సన్నద్ధమవుతున్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అందుబాటులో 8074480904, 9494933838 ఫోన్ నంబర్లు

జిల్లాలో అధిక వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఫిర్యాదులను స్వీకరించేందుకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు శంకరంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో అన్ని మండలాల నుంచి ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు, ఇతర సమస్యలపై ఫోన్ ద్వారా వివరాలు సేకరించనున్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ నుంచి కమాండ్ కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జులుగా కె.జీవన్‌రావు, జి.సత్యనారాయణను కంట్రోల్ రూమ్‌కు డిప్యుటేషన్‌పై నియమించారు. అధిక వర్షాలు, ఇతరత్రా ఇబ్బందులపై ఫోన్ నంబర్లు 8074480904, 9494933838కు సమాచారం ఇస్తే సహాయక చర్యలు చేపట్టనున్నారు.

కల్యాణపులోవకు జలకళ

రావికమతం: మండలంలోని కల్యాణపులోవ జలాశయం నీటిమట్టం సామర్థ్యానికి చేరువకు చేరుకోవడంతో శుక్రవారం సాయంత్రం గేట్లు ఎత్తి సర్పానదిలోకి అదనపు నీటిని విడిచిపెడుతున్నామని ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. జలాశయం 460 అడుగుల సామర్థ్యం కాగా, శుక్రవారం నాటికి 459 అడుగులకు నీటిమట్టం పెరిగింది. దీంతో రెండు గేట్లు ఎత్తి 120 క్యూసెక్కుల అదనపు నీటిని సర్పానదిలోకి విడిచిపెడుతున్నారు. ఈ నేపథ్యంలో సర్పానది ప్రవహించే మూడు మండలాలకు చెందిన చీమలపాడు, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, జెడ్.బెన్నవరం, కొత్తకోట, కన్నంపేట, జగ్గంపేట, జె.నాయుడు పాలెం, కొమరవోలు, ఆర్.కొత్తూరు, కుసర్లపూడి, తూటిపాల, తాడపాల, కొండల అగ్రహారం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఈ కోరారు.

వానొస్తే ఫైళ్లకు రక్షణ కరువు

- అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో అవస్థలు
- వర్షపు చినుకులు పడుతుంటే ప్లాస్టిక్ ట్రేలు ఏర్పాటు చేసుకోవలసిన దుస్థితి



కార్యాలయంలో వర్షపునీటిని తుడుస్తున్న సిబ్బంది

అనకాపల్లి టౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షం పడితే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం పైకప్పు నుంచి నీరుకారిపోయి ఫైళ్లన్నీ తడిసి ముద్దవు తున్నాయి. వర్షం కురుస్తున్న సమయంలో ఫైళ్లను భద్రపరుచుకోవడం సిబ్బందికి తలనొప్పిగా మారింది. అలాగే వర్షపు చినుకులు పడుతుండడంతో ప్లాస్టిక్ ట్రేలను ఏర్పాటు చేసుకోవలసి వస్తోంది. గురు, శుక్రవారాల్లో భారీ వర్షం కురవడంతో కార్యాలయంలోని ఫైళ్లు తడిసిపోవడంతో పాటు ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న శిరీషా అనే ఉద్యోగిని స్వల్పంగా విద్యుదాఘాతానికి గురైంది. అయితే ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేసింది. అయితే ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఇది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వ హయాంలో కార్యాలయానికి కొత్త భవన నిర్మాణం సాకారమవుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అయ్యో పాపం భోగాపురం

కిడ్నీ, కీళ్ల సంబంధిత వ్యాధుల బారిన జనం

- ఏడేళ్లలో 15 మంది మృత్యువాత
- ప్రస్తుతం మరో పది మంది బాధితులు
- కొళాయి నీటి వల్లేనంటున్న గ్రామస్థులు
- బోరు తవ్వించేందుకు ప్రయత్నిస్తే వైసీపీ నాయకులు అడ్డుకున్నారని ఆవేదన



భోగాపురం గ్రామం



యువకులు చందాలు పోగుచేసి బోరు వేయించడానికి చేసిన ఏర్పాట్లు (ఫైల్)

అచ్యుతాపురం, జూలై 19: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న భోగాపురంలో చాలా మంది మూత్ర పిండాలు, కీళ్ల నొప్పుల వ్యాధులతో బాధపడుతున్నారు. గత ఏడేళ్లలో ఈ గ్రామంలో ఈ వ్యాధులతో 15 మంది మృతి చెందారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం మరో పది మంది ఈ వ్యాధులతో బాధపడుతున్నారు. పంచాయతీ కొళాయిల ద్వారా సరఫరా చేసే నీళ్లను తాగడం వల్లే ఈ వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్థులు చెబుతున్నారు. గత్యంతరం లేక ఈ నీళ్లను తాగుతున్నామని వాపోతున్నారు. గ్రామంలోని యువకులు రూ.2 లక్షలు చందాలు పోగు చేసి బోరు తవ్వించాలని ప్రయత్నిస్తే కొందరు వైసీపీ నాయకులు అడ్డుకున్నారని చెబుతున్నారు. దీనిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులకు భయపడి కొందరు సొంత ఇళ్లను వదులుకొని అచ్యుతాపురంలో అద్దె ఇళ్లల్లో ఉంటున్నారని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో కూండ్రపు నాగేశ్వరరావు, కూండ్రపు శ్రీనివాసరావు, కూండ్రపు సన్నిబాబు, పైల బాబూరావు, కె. సత్యనారాయణ ఈ వ్యాధులతో బాధపడుతూ విశాఖపట్నంలోని ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నీటి నమూనాలను పరీక్షించాలని, వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఏడేళ్లుగా బాధపడుతున్నా..



నేను ఏడేళ్లుగా కిడ్నీల వ్యాధితో బాధపడుతున్నాను. నీటి వల్లే ఈ వ్యాధి వచ్చిందని గ్రామాన్ని విడిచి కుటుంబంతో సహా జంగులూరు జంక్షన్ వద్దకు వచ్చేశాను. నాలాగే చాలా మంది బాధపడుతున్నారు. నీటి శాంపిల్స్‌ను పరీక్షిస్తే వివరాలు తెలుస్తాయి.

\- కూండ్రపు నాగేశ్వరరావు, భోగాపురం

రెండు మోకాళ్లకు ఆపరేషన్ చేయించుకున్నా..




మోకాళ్ల నొప్పులతో నరకాన్ని అనుభవించాను. విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ముందు ఓ మోకాలికి ఆపరేషన్ చేయించా. రెండేళ్ల తరువాత మరో మోకాలికి ఆపరేషన్ చేయించుకున్నా. నాలాగే గ్రామంలో చాలా మంది బాధపడుతున్నారు.

\- కూండ్రపు అప్పారావు, రైతు

నేడే సింహగిరి ప్రదక్షిణ

సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం

- అప్పన్న ప్రచార రథాన్ని ప్రారంభించనున్న అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు
- విస్తృతంగా ఏర్పాట్లు
- ఈ ఏడాది 8 లక్షల మంది పాల్గొంటారని అంచనా



విద్యుద్దీపాలంకరణలో సింహగిరి



గిరి ప్రదక్షిణ ప్రారంభమయ్యే తొలి పావంచా

సింహాచలం, జూలై 19: **భూప్రదక్షిణతో సమానమైన ఫలాన్ని ఒసగే సింహ'గిరి ప్రదక్షిణ' శనివారం సాయంత్రం ప్రారంభం కానున్నది. ఏటా ఆషాఢ మాసంలో శుక్లపక్ష చతుర్దశినాడు లక్షలాది మంది కొండంత భక్తితో వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరి ఉన్న సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేయడం ఆచారంగా వస్తోంది.**

సింహగిరి ప్రదక్షిణ శనివారం సాయంత్రం నాలుగు గంటలకు కొండదిగువన తొలిపావంచా వద్ద ప్రారంభం కానున్నది. స్వామివారి పుష్పతేరు (ప్రచార రథం)ను దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గోవింద నామస్మరణలతో గిరి ప్రదక్షిణకు ఉపక్రమిస్తారు.

గిరి ప్రదక్షిణ మార్గం

తొలిపావంచా వద్ద ప్రారంభమయ్యే భక్తులు పాత అడివివరం, పైనాపిల్ కాలనీ, హనుమంతువాక, విశాలాక్షి నగర్, అప్పుఘర్, ఎం.వి.పి.కాలనీ డబుల్‌రోడ్డు, ఇసుకతోట, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, గురుద్వారా, ఆర్ అండ్ బి, ఎన్ఏడీ కూడలి, గోపాలపట్నం, గోశాల మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంటారు.

విస్తృత ఏర్పాట్లు

గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సంఖ్య ఏడాదిఏడాదికి పెరుగుతూ వస్తోంది. ఈ సంవత్సరం సుమారు ఎనిమిది లక్షల మంది పాల్గొనే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు ఇతర శాఖల అధికారుల సమన్వయంతో సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి తమ సిబ్బందితో కలిసి విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు 80 క్యూలను, 50 ఇనుప గడ్డర్లను ఏర్పాటుచేశారు. అదేవిధంగా రెండో ఘాట్‌రోడ్డు వద్ద నమూనా దేవాలయాన్ని ఏర్పాటుచేసి అక్కడ కూడా కొబ్బరికాయలు కొట్టేందుకు అనుకూల ఏర్పాట్లు చేశారు.

మార్గం పొడవునా 290 తాత్కాలిక మరుగుదొడ్లు, 29 వైద్య శిబిరాలు, 22 అంబులెన్స్‌లు, 390 ఎల్ఈడీ లైట్లు, 9 జనరేటర్లు, 6 ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లు ఏర్పాటుచేశారు. తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతలను పూర్తిస్థాయిలో జీవీఎంసీ చేపడుతోంది. అప్పుఘర్ వద్ద భక్తులు స్నానాలు చేయనున్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కోసం వివిధ శాఖల అధికారులతో కొండదిగువన కలశం వద్ద, అడివివరం, హనుమంతువాక, అప్పుఘర్, మాధవధార, ఎన్ఎస్‌టీఎల్ గేటు వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్‌లు సిద్ధం చేశారు. ఐదు డ్రోన్ కెమెరాలతో ఉత్సవాన్ని చిత్రీకరణకు ఏర్పాట్లు చేశారు. 20వ తేదీ ఉదయం 6 నుంచి 21వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు 98వ వార్డు పరిధిలోని మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. కొండ దిగువన 29 ప్రదేశాలలో, సింహగిరిపై మూడు ప్రాంతాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేకంగా ఫోన్ నంబర్లు

గిరి ప్రదక్షిణ నేపథ్యంలో దేవస్థానంతోపాటు పలు ప్రభుత్వ శాఖలు భక్తులకు అవసరమైన సలహాలు, సేవలు అందించేందుకు ప్రత్యేకంగా కొన్ని ఫోన్ నంబర్లు ఏర్పాటుచేశాయి. సింహాచలం దేవస్థానం (0891-2954944), జీవీఎంసీ (1800-42500009), నీటి సరఫరా, ప్రజా ఆరోగ్యశాఖలు (0891-2869111), విశాఖ పోలీస్ శాఖ (9390105353 లేదా 9330105355)

సింహగిరి ప్రదక్షిణం భూ ప్రదక్షిణతో సమం

అంతరాలయ దర్శనాలు, ఆర్జిత సేవలు రద్దు - 7లో

గ్రేటర్‌పై టీడీపీ దృష్టి

- తొలుత స్టాండింగ్ కమిటీల కైవసానికి వ్యూహం
- ఆ తరువాత మేయర్ పీఠం...
- 'దేశం'లో చేరేందుకు 22 మంది వైసీపీ కార్పొరేటర్లు సిద్ధం?
- రేపే ముహూర్తం . 7లో

విశాఖ డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మపై కేసు నమోదు

- వాహనాలను బలవంతంగా తన ఆధీనంలో ఉంచుకున్నారని హైదరాబాద్‌కు చెందిన ఇన్‌ఫ్రా కంపెనీ ఎండీ ఫిర్యాదు

అచ్యుతాపురం, జూలై 19: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అచ్యుతాపురం మండలంలో బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్)కు రహదారి నిర్మాణ సమయంలో హైదరాబాద్‌కు చెందిన ఆర్‌వీఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.వెంకటరమణయ్యకు, అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కన్నబాబురాజు కుమారుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ అయిన సుకుమారవర్మకు మధ్య గ్రావెల్ రవాణాకు సంబంధించి ఏవో ఒప్పందాలు జరిగాయి. అయితే క్వారీలో అనుమతులకు మించి ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

మెడికల్ షాపులో చోరీ

» రూ.25 వేల నగదు అపహరణ



మెడికల్ షాపులో క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తున్న దృశ్యం

కొత్తూరు, జూలై 19: అనకాపల్లి మండలం కొత్తూరు శారదానగర్‌లోని శ్రీలక్ష్మీ గణపతి మెడికల్ స్టోర్‌లో గురువారం రాత్రి చోరీ జరిగిందని అనకాపల్లి పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మెడికల్ షాపు యజమాని కొప్పల వీర వెంకట సత్యనారాయణ రోజూ మాదిరిగానే గురువారం రాత్రి షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లాడన్నారు. శుక్రవారం ఉదయం పక్క షాపునకు చెందిన వ్యక్తులు షాపు తెరిచి ఉన్న విషయాన్ని సత్యనారాయణకు తెలియజేయడంతో తమ షాపు చోరీకి గురైనట్టు గుర్తించామన్నారు. షాపులో ఉన్న రూ.25వేలు అపహరణకు గురయ్యాయని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో క్లూస్ టీమ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సత్యనారాయణ చెప్పారు.

లేటరైట్ తవ్వకాల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు హల్‌చల్

» అడ్డుకున్న గిరిజనులు

నాతవరం, జూలై 19: నాతవరం మండలం సుందరకోట లేటరైట్ ప్రాంతానికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులను గిరిజనులు అడ్డుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కొంత మంది వ్యక్తులు మూడు కార్లలో సుందరకోట సమీపంలోని కొండ వద్దకు వచ్చారు. అక్కడ లేటరైట్ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని వారు పరిశీలించడానికి వెళుతుండగా సుందరకోట, ఆసనగిరికి చెందిన 20 మంది గిరిజనులు అడ్డుకున్నారు. ఈ ప్రాంతాన్ని చూడడానికి వచ్చామని ఆ వ్యక్తులు గిరిజనులకు సర్ది చెప్పారు. ముందుకు వెళ్లడానికి వీలు లేదని గిరిజనులు వారిని అడ్డుకున్నారు. దీంతో చేసేది లేక వారు వెనుదిరిగి వెళ్లిపోయారు.

గ్రేటర్‌పై టీడీపీ దృష్టి

» తొలుత స్టాండింగ్ కమిటీల కైవసానికి వ్యూహం

» ఆ తరువాత మేయర్ పీఠం...

విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ పీఠంపై టీడీపీ దృష్టిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ఎజెండా మేరకు నగరంలో అభివృద్ధి జరగాలంటే జీవీఎంసీపై పట్టు ఉండాలని భావిస్తున్న తెలుగుదేశం అందుకు అనుగుణంగా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్న వైసీపీకి చెందిన సుమారు 22 మంది కార్పొరేటర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. వైసీపీ కార్పొరేటర్లు ఈనెల 21వ తేదీ ఆదివారం టీడీపీలో చేరే అవకాశం ఉంది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నగర మేయర్ పదవిపై టీడీపీ గురిపెట్టింది. అయితే మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలంటే మరికొంతకాలం వేచి ఉండాలి. మేయర్/మునిసిపల్ చైర్మన్ పదవుల్లో ఉన్న వారు నాలుగేళ్ల కొనసాగేలా వైసీపీ ప్రభుత్వం చట్టం చేసింది. అందువల్ల మేయర్ పదవిని టీడీపీ చేజిక్కించుకోవాలంటే అసెంబ్లీలో గతంలో చేసిన చట్టానికి సవరణ చేయాలి. అందుకు కొంత సమయం పడుతుంది. ఈలోగా జీవీఎంసీలో స్టాండింగ్ కమిటీలు కైవసం చేసుకోవాలని నిర్ణయించింది. గురువారం రాత్రి నగరంలోని ఒక హోటల్‌లో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, పార్టీ నగర అధ్యక్షుడు గంది బాబ్జీ, జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్ లీడరు పీలా శ్రీనివాస్, తదితరులు సమావేశమయ్యారు. మేయర్ పీఠం కంటే ముందు స్టాండింగ్ కమిటీలు చేజిక్కించుకోవాలని నేతలు అభిప్రాయపడినట్టు తెలిసింది. అభివృద్ధి జరగాలంటే జీవీఎంసీపై ప్రభుత్వానికి పట్టు ఉండాలని, అందుకు సంబంధించి పనులకు ఆమోదం తెలిపే స్టాండింగ్ కమిటీలను కైవసం చేసుకోవాలనే అభిప్రాయానికి వచ్చారు. ఇందుకు అవసరమైన వైసీపీ కార్పొరేటర్లను టీడీపీలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతం జీవీఎంసీలో 98 కార్పొరేటర్లలో టీడీపీకి 27 మంది కార్పొరేటర్లు ఉన్నారు. టీడీపీ తరపున గెలిచి వైసీపీకి మద్దతుగా నిలిచిన కాకి గోవిందరెడ్డి, లేళ్ల కోటేశ్వరరావు, కోడిగుడ్ల పూర్ణిమను ఎట్టి పరిస్థితుల్లో కౌన్సిల్‌లో మద్దతు కోరవద్దని నిర్ణయించినట్టు తెలిసింది. జనసేనకు ముగ్గురు, బీజేపీకి ఒకరు, ఇండిపెండెంట్లు ముగ్గురు ఉన్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వైసీపీకి చెందిన మరో కార్పొరేటర్ ఇప్పటికే టీడీపీలో చేరారు. ఇంకా జీవీఎంసీ పరిధిలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్నారు. మొత్తం 45 మంది ఉన్నారు. మరో ఐదుగురు సభ్యుల మద్దతు ఉంటే జీవీఎంసీలో కూటమికి మెజారిటీ లభిస్తుంది. అయినా కౌన్సిల్‌లో పటిష్టంగా ఉండాలని భావించిన టీడీపీ నేతలు వైసీపీ నుంచి వచ్చేందుకు సిద్ధమైన 22 మంది కార్పొరేటర్లనూ తీసుకోవాలని నిర్ణయించారు. వైసీపీ నుంచి ఎవరెవరిని తీసుకోవాలనే విషయమై ఎమ్మెల్యేలు గురువారం రాత్రి సమావేశంలో చర్చించారు. అయితే ఆ జాబితాలో ఉన్న ఒకరిద్దరిని పక్కనపెట్టాలని కొందరు ప్రతిపాదించారని తెలిసింది. పార్టీలోకి ఇష్టపూర్వకంగా వచ్చేవారిని మాత్రమే తీసుకోవాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 21వ తేదీ ఆదివారం వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరుతున్నట్టు సమాచారం. తరువాత జీవీఎంసీ సాధారణ సమావేశం నిర్వహణ తేదీ ప్రకటించే అవకాశం ఉంది. దీనిలో భాగంగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నారు.

జడ్పీలో కారుణ్య నియామకాలకు చర్యలు

విశాఖపట్నం, జూలై 19: జిల్లా పరిషత్‌లో ఉద్యోగం చేస్తూ మృతి చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం.పోలినాయుడు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబ సభ్యులకు నియామకాల విధి, విధానాలు, రిజర్వేషన్లు తదితర వాటిని వివరించారు. అర్హులకు వారంలోగా ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.

దువ్వాడ మీదుగా కోయంబత్తూరు-ధనపూర్‌కు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, జూలై 19: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వయా దువ్వాడ మీదుగా కోయంబత్తూరు నుంచి ధనపూర్‌కు (ఒకవైపు మాత్రమే) ప్రత్యేక రైలు ప్రవేశపెట్టినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. 06185 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 21న (ఆదివారం) రాత్రి 11.30 గంటలకు కోయంబత్తూర్‌లో బయలుదేరి మర్నాడు రాత్రి 8.10 గంటలకు దువ్వాడ, బుధవారం తెల్లవారుజాము 1.30 గంటలకు ధనపూర్ చేరుతుందని పేర్కొన్నారు.

యథావిధిగా రైళ్ల రాకపోకలు

విశాఖపట్నం, జూలై 19: అల్పపీడనం ద్రోణి ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు రైళ్ల రాకపోకలకు ఎటువంటి ప్రభావం చూపలేదు. శుక్రవారం రైళ్లన్నీ యథావిధిగా రాకపోకలు సాగించాయి. విశాఖ నుంచి విజయవాడ మీదుగా పలు ప్రాంతాలకు వెళ్లే జన్మభూమి, వందేభారత్, తిరుమల ఎక్స్‌ప్రెస్, గోదావరి ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ తదితర ప్రధాన ఒరిజినేటింగ్ రైళ్లు యథావిధిగా నిర్ణీత సమయానికి బయలుదేరాయి. అలాగే, ఇతర ప్రాంతాలలో బయలుదేరి వయా విశాఖ మీదుగా నడిచే రైళ్లకు కూడా భారీ వర్షాలతో ఎటువంటి ఆటంకం నెలకొనలేదని రైల్వే అధికారులు తెలిపారు. అయితే, ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని శాఖల సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు చెప్పారు. వాల్తేరు డివిజన్ పరిధిలోని స్టేషన్లలో నిరంతర పర్యవేక్షణ చేపట్టామన్నారు. కాగా, ఇతర డివిజన్లలో జరుగుతున్న నిర్మాణ పనులు, నిర్ణీత సమయానికి లింక్ రేక్ చేరని కారణంగా రీ షెడ్యూల్ చేసిన పలు రైళ్లు ఆలస్యంగా నడిచినట్టు పేర్కొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

ఎడతెరిపి లేని వాన

» లోతట్టు ప్రాంతాలు జలమయం



నక్కపల్లి మండలం జానకయ్యపేట వద్ద పంట పొలాల్లో చేరిన వర్షపు నీరు



పరవాడ పెద చెరువు నిండిపోయి బయటకు ప్రవహిస్తున్న నీరు

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో శుక్రవారం వేకువజాము నుంచి జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వరద నీటితో వాగులు, చెరువులు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల రహదారులపై ఉన్న గోతుల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపించాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.
- అనకాపల్లి/న్యూస్‌నెట్‌వర్క్



కృష్ణాదేవిపేటలోని రహదారి గోతుల్లో వర్షపు నీరు



రాంబిల్లి మండలం వెల్చూరు రోడ్డులో ఇలా..



మాడుగుల మండలం జంపెన వద్ద రోడ్డు ఇలా..

రైవాడ జలాశయం కళకళ

దేవరాపల్లి, జూలై 19: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సమ్మెద గెడ్డ, పినకోట చల్లగెడ్డల నుంచి ఐదు వందల క్యూసెక్కుల వరద నీరు మండలంలోని రైవాడ జలాశయంలో చేరిందని డీఈఈ ఆర్.సత్యంనాయుడు తెలిపారు. జలాశయ గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, శుక్రవారం 106.3 మీటర్లు వద్ద ఉంది.



నిండు కుండలా రైవాడ జలాశయం

కోనాం జలాశయం వద్ద..



కోనాం జలాశయం మెయిన్‌గేటు ద్వారా వృథాగా పోతున్న నీరు

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, శుక్రవారం సాయంత్రానికి 98.35 మీటర్లకు చేరుకుంది. జలాశయం ఎగువ ప్రాంతాల నుంచి 50 క్యూసెక్కుల నీరు వస్తుండగా జలాశయం మెయిన్‌గేట్లు, దిగువ కాలువ గేట్ల ద్వారా సుమారు 150 క్యూసెక్కుల వరకు నీరు వృథాగా పోతోంది.

మార్కెటింగ్‌లో రైతులు భాగస్వాములు కావాలి

» కలెక్టరు విజయకృష్ణన్

అనకాపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించే వివిధ రకాల పంటలను దళారుల ద్వారా కాకుండా రైతులే స్వయంగా మార్కెట్‌కు తీసుకువెళ్లి అమ్ముకొనే విధానం అమలు చేస్తే మేలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, జిల్లా స్థాయి మోనటరింగ్ కమిటీతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో సాగయ్యే వివిధ రకాల పంటలు, వాటి ఉత్పత్తులను రైతులే మార్కెటింగ్ చేసుకొనే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర అందేవిధంగా రైతు సంఘాలు, మోనటరింగ్ కమిటీలు కృషి చేయాలన్నారు. రైతులకు మేలు జరిగేవిధంగా అవసరమైన అన్ని రకాల సహాయక చర్యలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం రైతు ఉత్పత్తుల విధానంపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు, ఉద్యాన శాఖాధికారి ప్రభాకరరావు, పశుసంవర్ధక శాఖ అధికారి బి.ప్రసాద్‌రావు, వివిధ రైతు సంఘాలు, మోనటరింగ్ కమిటీల ప్రతినిధులు హాజరయ్యారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు

కల్యాణపులోవ రిజర్వాయర్ వద్ద అప్రమత్తంగా ఉండాలి

» ఇరిగేషన్ అధికారులకు తహసీల్దార్ ఆదేశం


రావికమతం, జూలై 19: కల్యాణపులోవ రిజర్వాయర్ వద్ద ఇరిగేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమణారావు ఆదేశించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రిజర్వాయర్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏఈ సత్యనారాయణదొరను ప్రస్తుత రిజర్వాయర్ పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 460 అడుగులు కాగా, ప్రస్తుతం 459 అడుగులకు చేరుకుందని తెలిపారు. ఇన్‌ఫ్లో వంద క్యూసెక్కులకు పైగా జలాశయంలోకి వచ్చి చేరుతోందని వివరించారు. సాయంత్రం రెండు గేట్లు ఎత్తి 120 క్యూసెక్కుల నీటిని సర్పానదిలోకి విడిచి పెట్టి నీటిమట్టాన్ని స్థిరీకరిస్తామని చెప్పారు. దీనిపై రోలుగుంట, మాకవరపాలెం తహసీల్దార్లకు కూడా తెలియజేశామన్నారు. అల్పపీడన ప్రభావం వల్ల నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకునే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు నీటిమట్టాన్ని సమీక్షించాలని తహసీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సతీశ్ పాల్గొన్నారు.



ఇరిగేషన్ అధికారులకు సూచనలిస్తున్న తహసీల్దార్ రమణారావు

సింహగిరి ప్రదక్షిణం భూ ప్రదక్షిణతో సమం

» గిరి ప్రదక్షిణతో కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం



సింహాచలం, జూలై 19: భారతీయ సంస్కృతికి మూలం వేదాలు. వేదాలు ప్రకృతిని పరమాత్మ స్వరూపంగా పేర్కొన్నాయి. అందుకే అనాదిగా భారతీయులు చెట్లు, పుట్టలు, నదులు, సముద్రాలను, పర్వతాలను పూజిస్తుంటారు. పర్వతాలకు భూధరాలని పేరు. అంటే భూమిని ధరించేవని అర్థం. వేదాల ప్రకారం విష్ణుః పర్వతానాం అధిపతిః. అందుకే పర్వతాలు పూజించబడుతున్నాయి. భూమి సమతుల్యతను కాపాడేవి పర్వతాలు. సాధారణంగా స్వయంభువుడుగా భగవానుడు వెలసిన క్షేత్రాలన్నీ అధికశాతం పర్వతాలపైనే ఉంటాయి. అదే పర్వతాలపై పురాణాల కాలంలో మునులు, యోగులు తపస్సులు చేసి జ్ఞాన సముపార్జన చేశారు. అటువంటి అనేక దైవీ భావనలు ఉండడం చేతనే పర్వతాలను పూజించడం, వాటి చుట్టూ ప్రదక్షిణలు చేయడం వేదకాలం నుంచే జరుగుతున్నట్టు విజ్ఞులు చెబుతారు.

వరాహ లక్ష్మీనృసింహస్వామి ద్వయావతారుడుగా వెలసిన దివ్యధామం సింహగిరి. అందుకే సింహగిరి చుట్టూ ప్రదక్షిణం చేయడం భూ ప్రదక్షిణతో సమాన ఫలితాన్ని ఇస్తుందని చెబుతారు. సింహగిరి చుట్టూ ప్రదక్షిణలు చేసిన వారికి విద్యాభివృద్ధి, ఉద్యోగప్రాప్తి, వివాహ అనుకూలత వంటి కోర్కెలు నెరవేరుతాయని పెద్దలు చెబుతుంటారు. కోర్కెలు లేకుండా సింహగిరి ప్రదక్షిణ చేసినవారు ఇహపర సౌఖ్యాలు పొందుతారని పండితుల మాట. భౌతికంగా సింహగిరి చుట్టుకొలత 32 కిలోమీటర్లు. సింహాచల క్షేత్ర మహాత్మ్యం ప్రకారం హిరణ్యకశిపుని సంహరించే సమయంలో విష్ణువు 32 రూపాలు ధరించాడని, అదేవిధంగా నృసింహస్వామి మూలమంత్రంలో 32 బీజాక్షరాలు ఉన్నాయని అందుకే 32 కిలోమీటర్ల వ్యాసార్థం కలిగిన సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేయడం భూ ప్రదక్షిణ చేయడంతో సమ ఫలాన్ని ఇస్తుందని అంటారు.

అంతరాలయ దర్శనాలు, ఆర్జిత సేవలు రద్దు

» నేడు, రేపు అప్పన్న దర్శన వేళల్లో మార్పులు

» సిఫారసు లేఖలకు నో

» కొండపైకి ప్రైవేటు వాహనాలను అనుమతించరు

సింహాచలం, జూలై 19: గిరి ప్రదక్షిణ, తుదివిడత చందన సమర్పణ కార్యక్రమాల నేపథ్యంలో శని, ఆదివారాల్లో సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి అంతరాలయ దర్శనాలు, అన్నిరకాల ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు నీలాద్రిగుమ్మం వద్ద నుంచే లఘు దర్శనం కల్పిస్తామన్నారు. శనివారం ఉదయం 6.30 నుంచి 2.30 గంటల వరకు, 3 నుంచి రాత్రి 7 గంటల వరకు, 8.30 నుంచి తిరిగి 10 గంటల వరకు స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. ఆషాఢ పౌర్ణమి రోజున (ఆదివారం) వేకువజామున 2.00 గంటలకు సుప్రభాత (ఏకాంత) సేవ, అనంతరం 3.00 గంటల వరకు స్వామి వారికి తుదివిడత చందన సమర్పణ జరుగుతుందన్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయ ప్రాకారం చుట్టూ ప్రదక్షిణకు అనుమతిస్తామని చెప్పారు. ఉదయం 5.00 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకూ నిర్విరామంగా భక్తులకు స్వామివారి దర్శనాలు లభిస్తాయి. సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ఆలయ బేడా మండపంలో ఢిల్లీ విజయం ఉత్సవం నిర్వహించనున్నందున భక్తులకు దర్శనాలు లభించవు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు, తిరిగి రాత్రి 8.30 నుంచి 9 గంటల వరకు భక్తులకు దర్శనాలు లభిస్తాయి. భక్తుల రద్దీ దృష్ట్యా శని, ఆదివారాల్లో ఎటువంటి సిఫారసు లేఖలు అనుమతించబడవని ఈవో పేర్కొన్నారు. భక్తుల రద్దీ కారణంగా సింహగిరిపైకి ఎటువంటి వాహనాలను అనుమతించరని, దిగువన ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లో తమ వాహనాలను నిలిపి దేవస్థానం ఏర్పాటుచేసిన వాహనాలలో మాత్రమే రాకపోకలు సాగించాలని ఈఓ కోరారు.

శారదానదికి జలకళ



అనకాపల్లి వద్ద పరవళ్లు తొక్కుతున్న శారదానది

అనకాపల్లి టౌన్, జూలై 19: పట్టణంలో శారదా నది ప్రవాహం జోరందుకుంది. రెండు రోజుల క్రితం వరకు నదిలో నీటి ప్రవాహం సాధారణంగా ఉండేది. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురియడంతోపాటు పలు రిజర్వాయర్ల గేట్లను ఎత్తడంతో శారదా నదిలోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో శారదా నది జలకళతో సంతరించుకుంది.

గరిష్ఠ స్థాయికి చేరువలో పెద్దేరు



గరిష్ఠ స్థాయికి చేరుతున్న పెద్దేరు జలాశయం నీటిమట్టం

మాడుగుల రూరల్: మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువైంది. జలాశయం పరివాహక ప్రాంతంలో, ఎగువ ప్రాంతంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వరద నీరు జలాశయంలోకి వచ్చి చేరుతున్నది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, శుక్రవారం మధ్యాహ్నానికి 136.30 మీటర్లకు చేరిందని ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇన్‌ఫ్లో వస్తున్నందున శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు 200 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

» కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

విశాఖపట్నం, జూలై 19: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాకాలంలో విద్యుత్ వైర్లు నేలపై పడిపోయే ప్రమాదముందని, రోడ్లపై, పొలాల్లో వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైర్లు తెగిపోయి పడి ఉంటే పట్టుకోవద్దని, తక్షణమే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

భారీ వర్షాల సందర్భంగా విద్యుత్ సరఫరా పర్యవేక్షణ నిమిత్తం సర్కిల్, ఆపరేషన్ డివిజన్ పరిధిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అనకాపల్లి డివిజన్ ఆఫీసు: 9490610022, కశింకోట డివిజన్ ఆఫీసు: 7382249866, నర్సీపట్నం డివిజన్ ఆఫీసు: 9491030714, పాడేరు డివిజన్ ఆఫీసు: 949061002.

విద్యుత్ సమస్యలపై వాట్సప్‌లో ఫిర్యాదు చేయవచ్చు

విశాఖపట్నం, జూలై 19: విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, అపరిష్కృత దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలు వాట్సప్, మెసేజ్ రూపంలో ఫిర్యాదు చేయవచ్చని ఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పాడేరులోని ఐటీడీఏ పరిధిలో గల ప్రజలు, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యలను 7382249881 నంబరుకు వాట్సప్, మెసేజ్ ద్వారా తెలియజేయవచ్చాన్నారు. వర్షాల వల్ల పడిపోయిన, పాడైన విద్యుత్ స్తంభాలు, ప్రమాదకరంగా ఉన్న వైర్లు, ఏరియా మొత్తం సరఫరా లేకపోవడం తదితర సమస్యలు పంపాలన్నారు. 1912 ద్వారా నేరుగా కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చని, లేదా 7382249881 నంబరుకు వాట్సప్, మెసేజ్ రూపంలో ఫిర్యాదు చేసేలా ఏర్పాటు చేశామన్నారు.


పాయకరావుపేట పట్టణంలోని మెయిన్ రోడ్డులో మధ్యాహ్నం వర్షం కురుస్తున్న దృశ్యం


ఎస్.రాయవరం మండలం వెంకటాపురంలో వరహానది గట్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ జయలక్ష్మి, ఆర్ఐ వినయ్


చెరువులా మారిన అచ్యుతాపురంలోని మండల కాంప్లెక్స్ ఆవరణ

ముసురు

- రోజంతా ఎడతెరిపి లేని వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- చిత్తడిగా మారిన రహదారులు
- బోసిపోయిన ప్రధాన జంక్షన్లు
- పాఠశాలలకు సెలవు ప్రకటించిన జిల్లా అధికారులు
- అనకాపల్లిలో చెరువును తలపించిన ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ

అనకాపల్లి టౌన్, జూలై 19 : బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా పడడంతో జన జీవనం స్తంభించింది. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల వరకు అనకాపల్లి పట్టణంలో 55.44 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కారణంగా ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ అంతా చెరువును తలపించింది. పాసింజర్ బస్సులు ఆగే ప్లాట్‌ఫాం నిండా వర్షపునీరు చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే, విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద నీరు బాగా నిలిచిపోవడంతో అనకాపల్లి- చోడవరం రోడ్డులోని వాహనచోదకుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. భారీ వాహనాలు నాయుళ్లవీధి, లక్ష్మీదేవిపేట రైల్వే గేటు మీదుగా రాకపోకలు సాగించాయి. అయితే రైళ్ల రాకపోకలు సాగే సమయంలో గేటు వేయడం వల్ల అడపాదడపా ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో వాహనచోదకులు ఇబ్బందులుపడక తప్పలేదు. తాజా వాతావరణం కారణంగా నిత్యం రద్దీగా ఉండే అనకాపల్లిలోని పలు జంక్షన్లు జనసందడి లేక వెలవెలబోయాయి. ఇదిలా వుంటే, వర్షం కారణంగా జీవీఎంసీ ఆవరణలోని డంపింగ్ యార్డు దుర్భరంగా మారింది. వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ, ప్రైవేటుపాఠశాలలు సెలవు ప్రకటించడంతో విద్యాసంస్థలు మూతపడ్డాయి. తహసీల్దార్ కార్యాలయం భవనంలోకి వర్షపు నీరు చేరడంతో సిబ్బంది ఇబ్బదులు ఎదుర్కొన్నారు.

కశింకోట : తుపాన్ కారణంగా మండలంలోని గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈ కారణంగా ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు. లోతట్టు ప్రాంతాల్లో నీరుచేరింది. కాగా గురువారం శుక్రవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు 36.4 మి.మీ.వర్షపాతం నమోదైట్టు అధికారులు తెలిపారు.

పాయకరావుపేట/రూరల్: మండలంలో ముసురుపట్టింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే వాతావరణం నెలకొంది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గ్రామీణ ప్రాంతాల రోడ్లు ఛిద్రంగా మారాయి. పాయకరావుపేట పట్టణంలోని పలు వీధుల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థలేక మురుగు రోడ్డుపైకి చేరింది. తాండవ వంతెన నుంచి వై జంక్షన్ వరకు ఉన్న మెయిన్ రోడ్డుపై పలు చోట్ల ఉన్న గోతుల్లో వర్షపునీరు చేరింది. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలావుంటే, వర్షాలు పడుతున్న తరుణంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని నర్సీపట్నం డీఎల్‌పీవో జీఎస్ఎస్.మూర్తి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పట్టణంతో పాటు పలు గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది చేపడుతున్న పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, పాయకరావుపేట పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే, మండలంలోని సత్యవరం, మంగవరం, గోపాలపట్నం, మాసాహెబ్‌పేట, పెంటకోట, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, కుమారపురం, గుంటపల్లి తదితర గ్రామాల్లోని పొలాల్లో వర్షపునీరు చేరింది.

నక్కపల్లి : అల్పపీడన ప్రభావం కారణంగా రెండు రోజుల నుంచి మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చిరు జల్లులుకాగా, రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ భారీ వర్షం పడింది. మండలంలో 44.4మి.మీ వర్షపాతం నమోదైంది. తీర గ్రామాల పరిస్థితిపై తహసీల్దార్ శ్రీకాంత్ ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. పంట పొలాల్లో వర్షపు నీరు భారీగా చేరింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయంలో పడిన వర్షాలు వల్ల వరి పొలాలకు మేలు జరుగుతుందని ఏవో ఉమా ప్రసాద్ తెలిపారు. తీర ప్రాంతాల్లో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎల్‌పీవో ఎస్ఎస్ఎస్ఎస్ మూర్తి సూచించారు. మధ్యాహ్నం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామరాజు, ఈవోఆర్‌డీ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కోటవురట్ల : తుఫాన్ కారణంగా మండలంలో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు భారీగా నిలిచిపోయింది. శనివారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సమాచారం మేరకు అధికారులు అప్రమత్తమయ్యాయి. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 32.0 మి.మీ. వర్షపాతం నమోదైనట్టు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు.

ఎస్.రాయవరం : అల్పపీడనం కారణంగా మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. వ్యాపారాలు సాగక చిరువ్యాపారులు, పనులు దొరక్క కూలీలు డీలాపడ్డారు. మండలంలో 11.4 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు తహసీల్దార్ జయలక్ష్మి తెలిపారు వరహా నదిని ఆనుకొని ఉన్న వెంకటాపురం, సోముదేవుపల్లి, లింగరాజుపాలెం తదితర గ్రామాలను ఆర్ఐ వినయ్‌తో కలిసి తహసీల్దార్ పరిశీలించారు. పలుచోట్ల నది గట్ల స్థితిపై ఆరా తీశారు.

ఎలమంచిలి : అల్పపీడనం కారణంగా మండలంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. శుక్రవారం ఉదయం నుంచి వర్షం పడుతుండడంతో జనజీవనం స్తంభించిపోయింది. రోడ్లపై ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. పలుచోట్ల పారిశుధ్య సమస్య తలెత్తింది. వర్షపు నీటికి మురుగు తోడవ్వడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఖరీఫ్ సాగుకు ఈ వర్షాలు ఎంతగానో ఉపయోగపడతాయని రైతులు ఆందనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, వర్షాల కారణంగా అధికార యంత్రాం అప్రమత్తమైంది. తహసీల్దార్ అప్పలరాజు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.


ఎలమంచిలిలో కుండపోతగా కురుస్తున్న వర్షం


సబ్బవరం సమీపంలోని పంట పొలంలో చేరిన నీరు

అచ్యుతాపురం : తుఫాన్ కారణంగా మండలంలో గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. లోతట్టు ప్రాంతం కావడం వల్ల అచ్యుతాపురంలోని మండల కాంప్లెక్స్‌లో నీరు చేరి చెరువులా మారింది. శుక్రవారం అచ్యుతాపురం, మోసయ్యపేటల్లో జరిగే వారపు సంతలు వర్షం కారణంగా వెలవెలబోయాయి. ఉదయాన్నే చుట్టుపక్కల గ్రామాల నుంచి కూరగాయలు తెచ్చిన రైతులు వ్యాపారలు సాగక డీలా పడ్డారు.

రాంబిల్లి : తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రోజంతా వర్షం పడుతూనే ఉంది. ఈ కారణంగా గ్రామాల్లోని రోడ్లు జలమయం అయ్యాయి. గోతుల్లో నీరు చేరుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు గ్రామాల్లోని పంట పొలాల్లో నీరు చేరాయి. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అప్పలస్వామి గ్రామాల్లో దండోరా వేయించారు. తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకారులు వర్షాలు తగ్గేవరకు వేటకు వెళ్లరాదని సూచించారు.

పరవాడ : మండల వ్యాప్తంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడ తెరిపి ఇవ్వని వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారుల పైనుంచి నీరు పారుతోంది. ఈ కారణంగా గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఇప్పటికే గోతులు ఏర్పడడంతో వాటిలో నీరు చేరి మరింత దారుణంగా మారాయి. పరవాడ పెదచెరువు పూర్తిగా నిండిపోయింది. కళింగ పైనుంచి వర్షపునీరు ఉధృతంగా పారుతోంది. ఫార్మాసిటీలోని పలు రహదారుల పై నుంచి వర్షపునీరు పారుతోంది. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణం వర్షపునీటితో నిండిపోయింది.

సబ్బవరం : మండలంలో తుఫాన్ కారణంగా శుక్రవారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. గడచిన మూడు రోజుల్లో 43.8 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. చెరువులు జలకళను సంతరించుకున్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు వెంకట్ తెలిపారు. ఇదిలావుంటే, తుఫాన్ కారణంగా మండలంలోని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో రామ్మోహన్‌రావు సూచించారు. వివిధ విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. అలాగే, తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏవో షేక్ బాబూరావు, ఈవోపీఆర్‌డీ మహేశ్, ఆర్ఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే పట్టదా..?

- పీసీబీ అధికారులు నిద్రపోతున్నారా...!
- పరవాడ మండల సమావేశంలో ఎమ్మెల్యే 'పంచకర్ల' ధ్వజం
- సమస్యలను వివరించిన ప్రజాప్రతినిధులు



సమావేశంలో సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పరవాడ, జూలై 19 : 'పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారుల తీరు దారుణంగా ఉంది. పరవాడ మండల ప్రజలు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతుంటే సదరు అధికారులు నిద్రపోతున్నారా...' అంటూ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం ఇక్కడ నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ సమావేశానికి పీసీబీ నుంచి ఉన్నతస్థాయి అధికారి కాకుండా దిగువస్థాయి ఉద్యోగి హాజరుకావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరవాడ ప్రాంతంలో కాలుష్య సమస్య తీవ్రంగా ఉందన్నారు. చెరువులతో పాటు ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో చేపలు కాలుష్యం కారణంగానే మృత్యువాతపడ్డాయని, ఇటువంటి తరుణంలో ప్రజలకు పొల్యూషన్‌కు గల కారణాలను తెలియజేయాల్సిన అధికారులు సమావేశానికి రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తానాం సర్పంచ్ కన్నూరు దేవి మాట్లాడుతూ సర్పంచ్‌కు తెలియకుండా తమ గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభించారని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే కలుగజేసుకుని ప్రజాప్రతినిధులకు తెలియకుండా గ్రామాల్లో అధికారులు అభివృద్ధి పనులు చేపట్టడం ప్రొటోకాల్ ఉల్లంఘించడమేనన్నారు. మండలంలో గల ప్రభుత్వ భూముల వివరాలు, ఆక్రమణకు గురైన భూములు, 22ఏ నుంచి తొలగించిన భూముల వివరాలతో పాటు రికార్డులు ట్యాంపరింగ్ చేసి కాజేసిన ప్రభుత్వ భూముల వివరాలను వారంలోగా తనకు అందజేయాలని తహసీల్దార్ గణపతిరావును ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాల్లో యువత గంజాయి మత్తులో తేలుతున్నారని, గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించాల్సిన బాధ్యత పోలీస్ అధికారులపై ఉందని సీఐ బాల సూర్యారావుకు సూచించారు. పెదముషిడివాడలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు పెచ్చుమీరాయని, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులలో అవకతవకలు జరిగినట్టు తన దృష్టికి వచ్చిందని, భవిష్యత్తులో ఇటువంటి తరహా సంఘటనలు జరగకుండా జాగ్రత్త పడాలని ఏపీవో గోవిందరావుకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం మరికొంతమంది సభ్యులు సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. తాడి గ్రామం తరలింపుతో పాటు పంచ గ్రామాల భూ సమస్య, షీలానగర్- సబ్బవరం ఆన్‌లైన్ రహదారి నిర్మాణంపై దృష్టి సారించడం జరుగుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, ఎంపీడీవో కీర్తిస్పందన, ఏవో రాంబాబు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు


ఉత్సవమూర్తి పూజలు చేస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, జూలై 19 : పట్టణంలోని దేముని గుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం ప్రధాన అర్చకులు పులకండం విజయబాబు, గిరిబాబు ఆధ్వర్యంలో వేదపండితులు చక్రాబ్జమండలర్చానను నిర్వహించారు. ఆలయ ఈవో రాజ సులోచన, ఆలయ పర్యవేక్షకులు సకల గోవిందరావు, పులకండం ప్రసాద్‌బాబు, రాజేష్‌బాబుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ


ఆది దంపతుల ఊంజల్ సేవలో భక్తులు

అనకాపల్లి టౌన్, జూలై 19 : గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవను శుక్రవారం రాత్రి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఈ వేడుకను జరిపారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సన్యాసినాయుడు, బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోర్టు సముదాయంలో నేత్ర వైద్య శిబిరం


శిబిరం ప్రారంభోత్సవంలో జిల్లా జడ్జి శ్రీవిద్య

అనకాపల్లి టౌన్, జూలై 19 : ఇక్కడి కోర్టు సముదాయంలో శుక్రవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తొలుత ఈ శిబిరాన్ని అనకాపల్లి జిల్లా జడ్జి ఎస్.శ్రీవిద్య ప్రారంభించారు. అనకాపల్లి బార్ అసోసియేషన్, మండల లీగల్ సర్వీస్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది అధికసంఖ్యలో పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు పంకజ్ డోంగ్రే జి.వేణుగోపాల్ పరీక్షలు జరిపారు. వేద్ నేత్రాలయా సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు రమేష్, విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంజీవీఎస్ కుమార్, దుర్గారావు, ఉపాధ్యక్షులు రోజా, జాయింట్ సెక్రటరీ తులసీ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 116 మంది ఎంపిక

పాయకరావుపేట, జూలై 19 : ఇక్కడి ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ జామ్ మేళాకు వివిధ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన 156 మంది అభ్యర్థులు హాజరుకాగా, పన్నెండు కంపెనీలకు చెందిన ప్రతినిధులు వచ్చి ఇంటర్వ్యూలు జరిపారన్నారు. వీరిలో 116 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు చెప్పారు. త్వరలో వీరి నియామక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.

ఎంఎస్ఎంఈ సెంటర్‌ను సందర్శించిన మంత్రి


మంత్రి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎంఎస్ఎంఈ సెంటర్ ప్రతినిధులు

రాంబిల్లి, జూలై 19 : మండలంలోని ఎస్ఈజడ్‌లో ఉన్న ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను శుక్రవారం రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఈ ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రం ప్రతినిధులు, శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడారు. ఎంతమంది యువత శిక్షణ పొందుతున్నారు.. ఇక్కడి సమస్యలు గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి సమస్యలను ఈ శిక్షణ కేంద్రం ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఈ సదర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ఈ ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇది దేశంలోనే అద్భుతమైన టెక్నాలజీ సెంటర్ అన్నారు. ఈ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా పొందడంతోపాటు, కాలేజీలలో ఫ్యాకల్టీలుగా కూడా పనిచేస్తున్నారన్నారు. ఇక్కడ ప్రతి ఏడాది 3వేలు మందికి శిక్షణ ఇస్తున్నారని, అదనపు సెంటర్లు కూడా మంజూరయ్యాయన్నారు. విద్యార్థులకు ట్రాన్స్‌పోర్టు సదుపాయాలు కల్పిస్తే మరో ఐదు వేలు మంది వరకు శిక్షణ ఇచ్చే అవకాశం ఉంటుందని మేనేజ్‌మెంట్ తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ప్రాథమిక సమస్యలుగా విద్యుత్, రవాణాలను గుర్తించామన్నారు. ఈ సమస్యలను అధిగమించేలా ప్రభుత్వానికి, కంపెనీలకు సహకరిస్తాన్నారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ ప్రతినిధులు మంత్రిఇ సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, ఎంఎస్ఎంఈ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన

... 5వ పేజీ తరువాయి

నమోదైంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయానికి జిల్లాలో పరవాడ మండలంలో అత్యధికంగా 108.9 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదుకాగా, గొలుగొండ మండలంలో స్వల్పంగా 21.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మునగపాక మండలంలో 96.2 మిల్లీమీటర్లు, కశింకోటలో 94.8, సబ్బవరంలో 94.4, రాంబిల్లిలో 85, బుచ్చెయ్యపేటలో 85, అచ్యుతాపురంలో 83.8, ఎలమంచిలిలో 74.8, అనకాపల్లిలో 73.4, రావికమతంలో 69.4, కె.కోటపాడులో 68.4, మాకవరపాలెంలో 68.2, నక్కపల్లిలో 67.2, కోటవురట్లలో 63.8, చోడవరంలో 58.6, దేవరాపల్లిలో 58.8, నాతవరంలో 57.4, నర్సీపట్నంలో 54.4, ఎస్.రాయవరంలో 51.8, పాయకరావుపేటలో 50.2, రోలుగుంటలో 47.2, మాడుగులలో 46.2, చీడికాడలో 44 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మపై కేసు నమోదు

... 5వ పేజీ తరువాయి

గ్రావెల్ తవ్వారన్న అభియోగంపై ఆర్‌వీఎస్ ఇన్‌ఫ్రాకు మైనింగ్ అధికారులు భారీ జరిమానా విధించారు. దీంతో నగదు లావాదేవీల విషయంలో వెంకటరమణయ్యకు, సుకుమారవర్మకు నడుమ విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం కంపెనీకి చెందిన 12 వాహనాలను సుకుమారవర్మ బలవంతంగా తీసుకుపోయి తన ఆధీనంలో ఉంచుకున్నారని ఆర్‌వీఎస్ ఇన్‌ఫ్రా ఎండీ వెంకటరమణయ్య శుక్రవారం అచ్యుతాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వాహనాలను అచ్యుతాపురం మండలం రావిపాలెంలో ఉంచినట్టు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సుకుమారవర్మపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

నక్కపల్లిలో జనసేన సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చూపుతున్న నగేష్, శివదత్

నక్కపల్లి, జూలై 19 : మండల కేంద్రం నక్కపల్లిలో గల జనసేన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదుపై పార్టీ శ్రేణులంతా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. జిల్లా కార్యదర్శి ఆకేటి గోవిందరావు, నాయకులు కురందాసు అప్పలరాజు, పాము గణేశ్, పిక్కి స్వామి, బాబూరావు, గబ్బర్‌సింగ్, చంద్రరావు, గోవింద్ పాల్గొన్నారు.

'విద్యాభివృద్ధికి ఎన్టీపీసీ కృషి అభినందనీయం'


ల్యాబ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, సంస్థ అధికారులు

పరవాడ, జూలై 19 : విద్యాభివృద్ధికి సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. సింహాద్రి సీఎస్ఆర్ నిధులు రూ.19 లక్షలతో పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ అండ్ రోబోటిక్ ఇన్నోవేషన్ ల్యాబ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు రోబోటిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, కళాశాల ప్రిన్సిపాల్ జీవీ నారాయణరావు, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, మాదంశెట్టి నీలబాబు, ఎన్టీపీసీ సీఎస్ఆర్ అధికారులు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

▸ తహసీల్దార్ మురళీమోహన్‌రావు


సర్పానది ప్రవహ ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్

మాకవరపాలెం, జూలై 19 : మండలంలోని లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమతంగా ఉండాలని తహసీల్దార్ మురళీమోహన్‌రావు కోరారు. శుక్రవారం ఉదయం నుంచి ఏకధాటిగా వర్షం కురవడంతో ఆయన లోతట్టు ప్రాంతాలైన తాడపాల ,తూటిపాల గ్రామాలను పరిశీలించారు. అనంతరం సర్పానది ఒడ్డున ఉన్న గ్రామాల ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. కల్యాణలోవ రిజర్వాయర్‌లో రోజురోజుకూ నీటి ప్రభావం పెరగడంతో కొన్ని గేట్లు ఎత్తివేసి దిగువ ప్రాంతమైన సర్పానదిలోకి నీరు చేరుతోంది. దీంతో నదికి ఆనుకొని ఉన్న తాడపాల, తూటిపాల, నారాయణ రాజుపేట తదితర గ్రామాల ప్రజలు అప్రమతంగా ఉండాలని తహసీల్దార్ కోరారు. అయితే ఈ వర్షాల వల్ల ప్రస్తుతానికి ఎటువంటి ప్రమాదం లేదని ఆయన తెలిపారు. ఈయన వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలు తగ్గే వరకూ మండల కేంద్రంలోనే ఉండాలి

▸ సిబ్బందికి ఎంపీడీవో రాంబాబు ఆదేశం

నాతవరం, జూలై 19 : వర్షాలు తగ్గేవరకు నాతవరం మండలంలో పని చేస్తున్న అధికారులు హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలని ఎంపీడీవో జె.రాంబాబు ఆదేశించారు. శుక్రవారం నాతవరం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్‌కుమార్‌తో కలసి ఆయన వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు వలన ఎటువంటి నష్టం జరిగినా వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. అధికారులకు సెలవులు రద్దు చేసినట్టు ప్రకటించారు. పంచాయతీల్లో ప్రజలకు తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలన్నారు.

సాయిబాబా హుండీ ఆదాయం రూ.45 వేలు

నర్సీపట్నం, జూలై 19 : స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో 25 రోజులకు హుండీ ఆదాయం రూ.45 వచ్చిందని ఆలయ కమిటీ పూర్వపు అధ్యక్షుడు కర్రి రాంగోపాల్ తెలిపారు. శుక్రవారం ఉదయం కమిటీ సభ్యులు సమక్షంలో హుండీ ఆదాయం లెక్కించి నగదుని పూర్వపు ట్రెజరర్, కార్యదర్శి లంక ఈశ్వరరావు, డాక్టర్ రామచంద్రరాజుకి అప్పగించామని తెలిపారు.


గొలుగొండ : జోగంపేటలో కురుస్తున్న వర్షం


మాకవరపాలెంలో కురుస్తున్న భారీ వర్షం


బురదతో నిండిన జి.వెంకటాపురం రోడ్డు

భారీ వర్షాలు.. అధ్వానంగా రహదారులు

▸ ఎడతెరపి లేని వానతో నిండిన చెరువులు
▸ రైతుల్లో ఆనందం

గొలుగొండ, జూలై 19 : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వర్షం కురిసింది. దీంతో పాతమల్లంపేట, పాకలపాడు, ఎర్రవరం, జోగంపేట, గొలుగొండ, పప్పుశెట్టిపాలెం, కొత్తఎల్లవరం గ్రామాల్లో గల చెరువులు నిండాయి. ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీటి కొరత తీరినట్టేనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాకలపాడు గ్రామం నుంచి రావణాపల్లి జంక్షన్ వరకూ రోడ్డు, జోగంపేట నుంచి సాలికమల్లవరం మీదుగా వెంకటాపురం వరకూ రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆరిలోవ అటవీ ప్రాంతంలో నాలుగు కల్వర్టులు నిర్మాణాలు చేపట్టకపోవడంతో రోడ్డు గతుకులమయంగా మారింది. త్వరితగతిన కల్వర్టుల నిర్మాణాలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మాకవరంపాలెంలో..

మాకవరపాలెం : మండలంలో శుక్రవారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, సాగునీటి కాలువల్లో పుష్కలంగా నీరు చేరింది.దీంతో ఈ ఖరీఫ్‌కు సాగునీటి ఇబ్బందులు ఉండకోవచ్చని రైతులు అంటున్నారు. శుక్రవారం పడిన భారీ వర్షాలతో గిడుతూరు,మల్లవరం, తామరం, బయ్యవరం తదితర గ్రామాల్లో రైతులు దమ్ములను ప్రారంభించారు. కాగా, ఈ వర్షానికి జి.వెంకటాపురం, రామన్నపాలెం,గిడుతూరు, జంగాలపల్లి వెళ్లే రహదారులపై ఉన్న గోతుల్లో నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉపాధి పనులతో పాటు భవన నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

వర్షాలతో జలకళ


ఏఎల్‌పురంలో నిండిన చెరువు

కృష్ణాదేవిపేట, జూలై 19 : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గొలుగొండ మండలంలో రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షాలతో బొడ్డేరు గెడ్డలు, వాగులు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే వర్షంతో రైతులు వ్యవసాయపనుల్లో నిమగ్నమయ్యారు. కృష్ణాదేవిపేట, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో ప్రధాన రహదారుల్లో ఉన్న భారీ గోతుల్లో వర్షం నీరు చేరి రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏఎల్‌పురం ఆర్టీసీ బస్‌స్టేషన్ వర్షం నీటితో చెరువును తలపిస్తోంది.

విద్యుత్ ప్రమాదాలకు గురి కావద్దు

గొలుగొండ, జూలై 19 : వర్షాల సీజన్‌లో విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులు పలు జాగ్రత్తలు పాటించాలని నర్సీపట్నం డివిజన్ విద్యుత్‌శాఖ డీఈ రామకృష్ణారావు గురువారం తెలిపారు. తడిచేతులతో విద్యుత్ మోటార్లను ఆఫ్ చేయరాదన్నారు. నడిచే మార్గంలో విద్యుత్ స్తంభాల వద్ద వేలాడుతున్న విద్యుత్ వైర్లను తాకవద్దన్నారు. విద్యుత్ సరఫరా, ప్రమాదాలపై డివిజన్‌లో ఫోన్ : 94906 10026కు సమాచారం అందించాలని కోరారు.

పని భారం తగ్గించండి

పారిశుధ్య కార్మికులు ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

నర్సీపట్నం, జూలై 19 : పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు పాత మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. శుక్రవారం ఉదయం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కార్మికులు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ పెరిగిన జనభాకి తగ్గట్టు కార్మికులు లేరని, ఉన్న సిబ్బంది మీద పని భారం పడుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో బొర్రా శ్రీను, రమణ, లోవ రాజు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా వరహానది


ఉత్తరవాహిని చెక్ డ్యామ్ గేట్లు తెరిచి వదిలిన వరహానది నీరు

నర్సీపట్నం, జూలై 19 : నర్సీపట్నంలో శుక్రవారం ఉదయం నుంచి మోస్తారు వర్షం పడి రోడ్లు తడిసి ముద్దయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటలు వరకు 27.4 ఎంఎం వర్షపాతం నమోదు అయింది. బలిఘట్టం ఉత్తరవాహిని ఉధృతంగా ప్రవహించింది. ఉత్తరవాహిని వద్ద చెక్‌డ్యామ్ గేట్లు ఎత్తి నీటిని దిగువలకు వదిలారు. ఈ వర్షాల వల్ల ఖరీఫ్‌కు నీటి కొరత సమస్య ఉండకపోవచ్చని రైతులు అంటున్నారు.

తాండవ రిజర్వాయర్‌లో 365 అడుగులకు చేరిన నీటి నిల్వలు

▸ గరిష్టనీటి మట్టం 380 అడుగులు


తాండవ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న డీఈ అనూరాధ

నాతవరం, జూలై 19 : ఇటీవల కురుస్తున్న వర్షాలతో తాండవ రిజర్వాయర్‌లో స్వల్పంగా నీటినిల్వలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఎడతెరపి లేకుండా వర్షం పడడంతో తాండవ గరిష్టనీటి మట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం తాండవలో 365 అడుగుల నీటినిల్వలు చేరుకున్నాయి. తాండవ ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో ద్వారా 500 క్యూసెక్కుల నీరు వస్తోంది. అలాగే శుక్రవారం సాయంకాలం తాండవ డీఈ అనురాధ తాండవ రిజర్వాయర్‌ను సందర్శించి నీటినిల్వలను పరిశీలించారు. ఈ వర్షాలకు తాండవలో తగినన్ని నీటినిల్వలు పెరిగితే తాండవ ఆయకట్టు రైతులకు ఈ ఖరీఫ్‌కు ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు.

20న టీడీపీ మండలస్థాయి కార్యకర్తల సమావేశం

నాతవరం, జూలై 19 : జూలై 20న (శనివారం) మండల కేంద్రం నాతవరం టీడీపీ కార్యాలయంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం జరుగుతుందని మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ తెలిపారు.

ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ కమిటీ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

ముంచెత్తిన వాన

... 5వ పేజీ తరువాయి

నమోదైంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయానికి జిల్లాలో పరవాడ మండలంలో అత్యధికంగా 108.9 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదుకాగా, గొలుగొండ మండలంలో స్వల్పంగా 21.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మునగపాక మండలంలో 96.2 మిల్లీమీటర్లు, కశింకోటలో 94.8, సబ్బవరంలో 94.4, రాంబిల్లిలో 85, బుచ్చెయ్యపేటలో 85, అచ్యుతాపురంలో 83.8, ఎలమంచిలిలో 74.8, అనకాపల్లిలో 73.4, రావికమతంలో 69.4, కె.కోటపాడులో 68.4, మాకవరపాలెంలో 68.2, నక్కపల్లిలో 67.2, కోటవురట్లలో 63.8, చోడవరంలో 58.6, దేవరాపల్లిలో 58.8, నాతవరంలో 57.4, నర్సీపట్నంలో 54.4, ఎస్.రాయవరంలో 51.8, పాయకరావుపేటలో 50.2, రోలుగుంటలో 47.2, మాడుగులలో 46.2, చీడికాడలో 44 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

విశాఖ డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మపై కేసు నమోదు

... 5వ పేజీ తరువాయి

గ్రావెల్ తవ్వారన్న అభియోగంపై ఆర్‌వీఎస్ ఇన్‌ఫ్రాకు మైనింగ్ అధికారులు భారీ జరిమానా విధించారు. దీంతో నగదు లావాదేవీల విషయంలో వెంకటరమణయ్యకు, సుకుమారవర్మకు నడుమ విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం కంపెనీకి చెందిన 12 వాహనాలను సుకుమారవర్మ బలవంతంగా తీసుకుపోయి తన ఆధీనంలో ఉంచుకున్నారని ఆర్‌వీఎస్ ఇన్‌ఫ్రా ఎండీ వెంకటరమణయ్య శుక్రవారం అచ్యుతాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వాహనాలను అచ్యుతాపురం మండలం రావిపాలెంలో ఉంచినట్టు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సుకుమారవర్మపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

చోడవరం
నియోజకవర్గం

భక్తిశ్రద్ధలతో చండీశ్రీ శ్రీరుద్ర మహాయాగం


యాగంలో ఎమ్మెల్యే రాజు తదితరులు

చోడవరం, జూలై 18 : పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వరాలయంలో చండీశ్రీ శ్రీరుద్ర మహాయాగాన్ని శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి సారథ్యంలో కాకినాడకు చెందిన శ్రీపాద అవధాని, బులుసు ప్రభాకర శర్మల పర్యవేక్షణలో వేదపండితులు ఈ వేడుకను జరిపించారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుతో పాటు అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ వర్మ, శ్రీవిజ్ఞాన్ స్కూల్ డైరెక్టర్ ఎంఎంకే రాజు, ఇతర ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా సంకల్ప దినోత్సవం


ఆధ్యాత్మికవేత్త చారిని సత్కరిస్తున్న యోగా శిక్షకులు

చోడవరం, జూలై 19 : స్థానిక వికాస కేంద్రంలో శుక్రవారం యోగా సంకల్పదినాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా గురువు అర్రెపు శ్రీనివాస్ పర్యవేక్షణలో వంద రోజుల యోగా శిక్షణ పూర్తయిన సందర్భంగా ఈ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆధ్యాత్మికవేత్త చారి యోగా విశిష్టతను వివరించారు. దేవర అప్పలరాజు, పప్పల రమణమూర్తి, కామేశ్, అడపా భూలక్ష్మి, డి. రాజా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వరి నారుకు ఊపిరి పోసిన వర్షం

రావికమతం, జూలై 18 : నిన్నటి వరకు వర్షాభావ పరిస్థితులతో ఎండిన వరి నారుమళ్లకు తాజా వర్షం ఊపిరి పోసినట్టైంది. విత్తనాలువేసి మొలకెత్తిన నాటినుంచి వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో నారు భూమిలో ఉన్న తేమతో ఓ మోస్తరుగా మొదట్లో ఎదిగొచ్చినప్పటికీ ఆ తరువాత తేమలేక మడులు ఎండి బీటలు వారాయి. దీంతో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు ఊపిరిపోశాయి.


కె.కోటపాడులో రోడ్డు పైనుంచి పారుతున్న వర్షపు నీరు


రోలుగుంట మండలం కొమరవోలులో రోడ్డుపై పడిన గుంతల్లో చేరిన నీరు

రోజంతా వానే

▸ అల్పపీడనం ప్రభావంతో ముసురు ▸ లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు
▸ చిత్తడిగా మారిన పల్లె రహదారులు ▸ పొంగిపొర్లుతున్న కాలువలు, గెడ్డలు


చోడవరం పట్టణంలో వర్షం కురుస్తున్న దృశ్యం

చోడవరం, జూలై 19 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శుక్రవారం తెల్లవారుజాము నుంచి మండలంలో భారీ వర్షం కురిసింది. గురువారం జల్లులకే పరిమితమైన వాన శుక్రవారం విరామం లేకుండా పడడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపైనీరు పారింది. పల్లెల్లోని రహదారులు చిత్తడిగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే పలు జంక్షన్లు బోసిపోయి కనిపించారు. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు డీలాపడ్డారు. అయితే పొలాల్లో నీరు బాగానే చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చెయ్యపేట : మండలంలో ఎడతెరిపి లేకుండా శుక్రవారం వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు నాలుగున్నర సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వాగులు, వంకలు, కాలువలు జలకళను సంతరించుకున్నాయి. పల్లపు ప్రాంతాలు జలమయమైయ్యాయి. ప్రజలు ఇళ్లకే పరిమతం కావడంతో వ్యాపార, వాణిజ్య దుకాణాలు బోసిపోయాయి. వడ్డాదిలోని పెద్దేరుపై నిర్మించిన కాజ్‌వే సీసీ పైపులకు అడ్డంగా చిక్కుకుపోయిన చెత్తను పంచాయతీ పారిశుధ్య కార్మికులు శుక్రవారం సాయంత్రం తొలగించారు. ఈ పనులను పంచాయితీ ఈవో లవరాజు పర్యవేక్షించారు. ఇదిలావుంటే, బీఎన్ రోడ్డులోని వడ్డాది డెయిరీ బల్క్ మిల్క్ సెంటర్ ఎదురుగా ఉన్న గొయ్యిలో విశాఖపట్నం నుంచి ఏజెన్సీకి వెళ్తున్న బియ్యం లోడ్ లారీ దిగబడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రెండు ఎక్స్‌కవేటర్ల సాయంతో దానిని బయటకు తీశారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వెంకటాచార్యులు వివిధ శాఖలకు చెందిన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

రోలుగుంట : మండలంలోని ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కారణంగా పలు రహదారులు అధ్వానంగా మారాయి. ప్రధానంగా చోడవరం- భీమునిపట్నం రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో వాటిలో వర్షపు నీరు చేరి మరింత దుర్భరంగా మారాయి. ఫలితంగా వాహనచోదకులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. రాత్రి వేళ రోడ్డుపై గొయ్యి ఎక్కడో గుర్తించలేని పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు. ఇదిలావుంటే, మండలంలోని కొండపాలెంలో బంటు పైడియ్యనాయుడుకు చెందిన పెంకిటిళ్లు వర్షానికి నానిపోయి పాక్షికంగా కూలిపోయింది. అయితే ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాల్సిందిగా బాధితుడు కోరారు.


బుచ్చెయ్యపేట : వడ్డాది కాజ్‌వే పైపులకు అడ్డంగా ఉన్న చెత్త తొలగిస్తున్న కార్మికులు

మాడుగుల/మాడుగుల రూరల్ : మండలంలో ముసురు వాతావరణం నెలకొంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రోజంతా వర్షం పడుతూనే ఉంది. దీంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. పలుచోట్ల రోడ్లపై భారీ గోతులు పడడంతో వాటిలో వర్షపు నీరు చేరింది. దీంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వాతావరణం కారణంగా కూలి పనులు లేక కూలీలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంట పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు దమ్ములు పట్టే పనిలో నిమగ్నమయ్యారు. కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వర్షం పడినప్పటికీ గాలులు వేయకపోవడంతో ఎక్కడా ఎలాంటి నష్టం జరగలేదు.

కె.కోటపాడు : మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. వివిధ పనులపై బయటకు వెళ్లినవారు తగిన జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ తడిసిపోక తప్పలేదు. తాజాగా కురుస్తున్న వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ వర్షం వ్యవసాయ పనులకు ఉపయోగపడుతుందని రైతులు చెపుతున్నారు.

చీడికాడ : మండలంలో శుక్రవారం ఎడతెరపి లేకుండా వాన కురిసింది. దీంతో ఎటు చూసినా నీరే కనిపించింది. వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. తుఫాన్ కారణంగా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఉమామహేశ్వరి సూచించారు. ఈ మేరకు తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, ఏపీవో సియ్యాద్రి నాగరాజు, ఏవో కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం

శాకాంబరిగా ఉమా మహేశ్వరీదేవి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దేవరాపల్లి, జూలై 19 : మండల కేంద్రం దేవరాపల్లిలోని ఉమామహేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు శుక్రవారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమించారు. ఆషాఢ మాసం సందర్భంగా ఆదిమాతను తొలుత అర్చకులు చంద్రమౌళి, నాగేశ్వరరావు శర్మ, మూర్తిలు వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలతో సుందరంగా అలంకరించారు. విశేష పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరితో పాటు పలువురు మహిళలు అమ్మవారి సేవలో తరించారు.

వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక


టీపీలో చేరిన వారిని అభినందిస్తున్న బత్తులు, బండారు

కె.కోటపాడు, జూలై 19 : మండలంలోని గొండుపాలెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు శుక్రవారం టీడీపీలో చేరారు. మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వంటాకు శ్రీను, చోడవరం షుగర్ ఫ్యాక్టరీ పాలకవర్గం మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్, గొండుపాలెం పాల సంస్థ డైరెక్టర్లు బండారు సూర్యనారాయణ, వంటాకు దేముడుబాబు, సాగునీటి సంఘం మాజీ డైరెక్టర్ బండారు రామన్నపాత్రుడు, మాజీ ఉప సర్పంచ్ ఆడారి ఈశ్వరరావు, సీనియర్ నాయకుడు మద్దాల ఈశ్వరరావు తదితరులు టీడీపీ గూటికి చేరడంతో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గొడగలీ సామాజికవర్గం కుల ధ్రువీకరణకు దరఖాస్తులు చేసుకోవచ్చు

▸ తహసీల్దార్ రమణారావు

రావికమతం, జూలై 19 : గొడగలీ సామాజికవర్గానికి చెందినవారు కుల ధ్రువీకరణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని తహసీల్దార్ రమణారావు తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ సబ్ క్యాస్ట్ అయిన ఈ సామాజికవర్గానికి చెందినవారు కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ఆప్షన్ లేకపోవడంతో ఈ నెల 12న మండలంలోని కొత్తకోటకు చెందిన ఈ కులస్థులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారన్నారు. 2023 వరకు రావికమతం తహసీల్దార్ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారని, వీటి రెన్యూవల్‌కు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేయడానికి వెళ్లగా ఈ కులానికి సంబంధించిన ఆప్షన్ ఆన్‌లైన్‌లో లేదని దరఖాస్తు తీసుకునేందుకు సిబ్బంది నిరాకరించారని ఆందోళన సమయంలో వారు వివరించారన్నారు. ఈ మేరకు వారి సమస్యను నర్సీపట్నం ఆర్డీవో దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన ఉన్నతాధికారులతో చర్చించారు. మండలంలో అన్ని గ్రామ సచివాలయాల్లో శుక్రవారం గొడగలీ సామాజికవర్గానికి చెందిన వారి కుల ధ్రువీకరణకు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఆన్‌లైన్ ఆప్షన్‌ను నమోదు చేయించారు. ఈ అవకాశాన్ని సదరు సామాజికవర్గ సభ్యులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తహసీల్దార్ సూచించారు.

ఆలయాల అభివృద్ధికి రూ.1.8 లక్షల విరాళం

మాడుగుల, జూలై 19 : మండల కేంద్రం మాడుగులలో గల మూడు ఆలయాల అభివృద్ధికి కాంట్రాక్టర్ చెక్కా శ్రీరామమ్మూర్తి శుక్రవారం రూ. 1.8లక్షలను విరాళంగా అందజేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయానికి రూ.లక్షా 26వేలు, మోదకొండమ్మ ఆలయానికి రూ. 27వేలు, షిర్డీసాయిబాబా ఆలయానికి రూ.27వేలు చొప్పున శుక్రవారం అందించారు. ఆలయాల కమిటీ ప్రతినిధులు పుప్పాల అప్పలరాజు, కేవీపీ వెంకటేష్, ఆంజనేయులు, కొప్పాక వెంకట రాజేశ్వరరావు, దేవరపల్లి శ్రీను తదితరులు అభినందించారు.

